నేటి మ్యాచ్ | రాజస్థాన్ X కోల్‌కతా | రా.7.30 నుంచి | వేదిక గువాహటి

క్వార్టర్స్‌కు బాంబ్రీ జోడీ

మియామి: భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు యుకీ బాంబ్రీ, తన పోర్చుగల్ సహచర ఆటగాడు నునో బోర్గ్స్ జోడీ మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో బాంబ్రీ-బోర్గ్స్ ద్వయం 7-6 (7/4), 6-2తో ఆడమ్ పవ్లసెచ్ (చెక్ రిపబ్లిక్)-జెమీ ముర్రే (యూకే)ను వరుస సెట్లలో చిత్తు చేసింది. మ్యాచ్‌లో ఇండో, పోర్చుగల్ ద్వయం 4 ఏస్‌లు సంధించింది. ఆడమ్-ముర్రే ఏడు డబుల్ ఫాల్ట్స్‌తో మూల్యం చెల్లించుకుంది.

ప్రాక్టీస్ మ్యాచ్‌లకు స్టార్ క్రికెటర్లు!

ఢిల్లీ: ఈ ఏడాది జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు సన్నాహకంగా భారత 'ఏ' జట్టు రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడనుంది. ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడబోయే రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లలో భారత సీనియర్ జట్టులో ఆడబోయే పలువురు స్టార్ క్రికెటర్లు పాల్గొననున్నట్టు సమాచారం. మే 30న మొదటి, జూన్ 6న రెండో ప్రాక్టీస్ మ్యాచ్ జరుగనుంది. ఐపీఎల్ నాకౌట్ దశ (మే 20) మొదలయ్యాక అందుబాటులో ఉండే టెస్టు జట్టు సభ్యులు లండన్ విమానమెక్కనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి.

అవేశ్‌కు లైన్‌క్లియర్

లక్నో: ఐపీఎల్-18వ సీజన్‌ను ఓటమితో ఆరంభించిన లక్నో సూపర్ జెయింట్స్‌కు శుభవార్త. ఈ సీజన్‌లో లక్నోకు ప్రాతినిధ్యం వహిస్తున్న యువ పేసర్ అవేశ్ ఖాన్ త్వరలో ఆ జట్టుతో చేరనున్నాడు. గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగబోయే మ్యాచ్‌లో అతడు ఆడనున్నట్టు తెలుస్తోంది. గాయం కారణంగా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో పునరావాసం పొందుతున్న అవేశ్.. పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించినట్టు సమాచారం. అతడు ఆడేందుకు బీసీసీఐ కూడా సమ్మతించినట్టు లక్నో వర్గాలు తెలిపాయి.

భర్తపై బాక్సర్ స్వీటీ దాడి

● విడాకుల కోసం వేడుకోలు

హిసార్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ప్రముఖ కబడ్డీ క్రీడాకారుడు దీపక్ హుడాపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళా బాక్సర్ స్వీటీ బూర.. పోలీస్ స్టేషన్‌లోనే అతడిపై భౌతిక దాడికి దిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే... తనకు విడాకులు కావాలని కోరుతూ హిసార్‌లోని పోలీస్ స్టేషన్‌లో స్వీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 15న హుడా అతడి కుటుంబ సభ్యులతో కలిసి విచారణకు హాజరయ్యాడు. ఇరు కుటుంబాలు పోలీస్ స్టేషన్‌లో ఉండగా మాటామాటా పెరిగి సహనం కోల్పోయిన స్వీటీ.. హుడాపై దాడికి దిగింది. అతడి గొంతు పట్టుకుని నులుమబోయింది. అక్కడే ఉన్న ఇరు కుటుంబ సభ్యుల జోక్యంతో ఆమె శాంతించింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తాజాగా వైరల్ అయ్యింది. ఈ ఘటన అనంతరం స్వీటీ స్పందిస్తూ...'నేను అతడితో జీవించదలుచుకోలేదు. నాకు అతడి నుంచి ఒక్క రూపాయి కూడా వద్దు. విడాకులు ఇప్పించండి చాలు. ఇదే విషయంపై నేను ఈనెల 11న హిసార్ ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఇంత వరకూ దానిపై విచారణ జరిపించలేదు. నాకు న్యాయం చేయాలని ప్రధాని మోదీని, హోంమంత్రి అమిత్ షాను వేడుకుంటున్నా' అని భావోద్వేగానికి గురైంది. 2022లో వీరి వివాహం జరుగగా అదనపు కట్నం కోసం హుడా కుటుంబం వేధిస్తోందని స్వీటీ రెండు నెలల క్రితం పోలీసులను ఆశ్రయించింది.

కాంస్య పోరుకు సునీల్

అమ్మాన్ (జోర్డాన్): ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత రెజ్లర్ సునీల్ కుమార్ కాంస్య పోరుకు అర్హత సాధించాడు. మంగళవారం ప్రారంభమైన ఈ ఈవెంట్‌లో తొలి రోజు గ్రీకో రోమన్ విభాగంలో పోటీలు జరుగగా భారత్ నుంచి సునీల్ కుమార్ ఒక్కడే సెమీస్ దాకా వెళ్లగలిగాడు. 87 కిలోల విభాగంలో పోటీపడుతున్న సునీల్ మొదటి బౌట్‌లో 10-1తో తజకిస్థాన్ రెజ్లర్ అబ్దుల్ ఖేవ్‌ను చిత్తు చేశాడు. కానీ సెమీస్‌లో అతడు 1-3తో ఇరాన్‌కు చెందిన యాసిన్ యజ్జి చేతిలో పరాభవం పాలయ్యాడు. జియాజిన్ హువాంగ్ (చైనా)తో బుధవారం జరిగే కాంస్య పోరులో సునీల్ తలపడనున్నాడు. మిగిలినవారి విషయానికొస్తే ఉమేశ్, నితిన్, ప్రేమ్ ఆరంభ బౌట్‌లోనే విఫలమయ్యారు.

ఏషియన్ టోర్నీకి సాత్విక్ జోడీ దూరం

ఢిల్లీ: వచ్చే నెల 8 నుంచి మొదలుకాబోయే 2025 బ్యాడ్మింటన్ ఏషియన్ చాంపియన్‌షిప్స్ నుంచి భారత డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి తప్పుకున్నారు. ఇటీవలే ముగిసిన ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఆరంభ మ్యాచ్‌లోనే గాయంతో గేమ్ మధ్యలోనే వెనుదిరిగిన ఈ జోడీ.. తర్వాత జరిగిన స్విస్ ఓపెన్ నుంచి వైదొలగగా తాజాగా ఏషియన్ చాంపియన్‌షిప్స్‌నకూ దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ టోర్నీ నుంచి తప్పుకోవడం భారత జోడీకి వరుసగా ఇది రెండోసారి.

కింగ్స్ పంజాబ్

టైటాన్స్‌పై అద్భుత విజయం

శ్రేయాస్ అయ్యర్ విజృంభణ

రాణించిన అర్ష్‌దీప్, విజయ్‌కుమార్

శ్రేయాస్ (97*)

ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ గుజరాత్ టైటాన్స్‌పై అద్భుత విజయం సాధించింది. కొత్త కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ అజేయ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ పంజాబ్ భారీ స్కోరు అందుకుంది. గుజరాత్ బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ అయ్యర్ వీరవిహారం చేశాడు. లక్ష్యఛేదనలో సుదర్శన్, బట్లర్, రూథర్‌ఫర్డ్ పోరాడినా..ఇంపాక్ట్ ప్లేయర్ విజయ్‌కుమార్ రంగప్రవేశంతో మ్యాచ్ పంజాబ్ దిక్కుమొగ్గింది.

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ల హవా కొనసాగుతున్నది. లక్నోపై ఢిల్లీ యంగ్ గన్ అశుతోష్ అసాధారణ ఇన్నింగ్స్ మరిచిపోక ముందే గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ ఇంపాక్ట్ విజయకుమార్ సూపర్ బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలకమయ్యాడు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 11 పరుగుల తేడాతో గుజరాత్‌పై గెలిచింది. తొలుత శ్రేయాస్ అయ్యర్(42 బంతుల్లో 97 నాటౌట్, 5ఫోర్లు, 9సిక్స్‌లు), ప్రియాంశ్(47) రాణించడంతో పంజాబ్ 20 ఓవర్లలో 243/5 స్కోరు చేసింది. సాయికిషోర్(3/30) ఆకట్టుకున్నాడు. లక్ష్యఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 232/5 స్కోరు చేసింది. సుదర్శన్(41 బంతుల్లో 74, 5ఫోర్లు, 6సిక్స్‌లు), బట్లర్(54), రూథర్‌ఫర్డ్(46) సాధికారిక ఇన్నింగ్స్ ఆడారు. అర్ష్‌దీప్‌సింగ్(2/36) రెండు వికెట్లు తీయగా, విజయ్‌కుమార్(3-0-28-0)..గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేశాడు. శ్రేయాస్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు: **పంజాబ్:** 20 ఓవర్లలో 243/5 (శ్రేయస్ 97 నాటౌట్, ప్రియాన్ష్ 47, సాయికిషోర్ 3/30, రబాడా 1/41), **గుజరాత్:** 20 ఓవర్లలో 232/5(సుదర్శన్ 74, బట్లర్ 54, అర్ష్‌దీప్‌సింగ్ 2/36, మ్యాక్స్‌వెల్ 1/26)

2 పంజాబ్‌కు ఈ లీగ్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు. గత సీజన్‌లో ఆ జట్టు కోల్‌కతాపై 262/2 చేసింది.

టైటాన్స్ పోరాడినా:

కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్‌కు శుభారంభమే దక్కింది. తొలి వికెట్‌కు సుదర్శన్, గిల్ (14 బంతుల్లో 33, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) జోడీ 6 ఓవర్లలో 61 పరుగులు జోడించింది. మొదటి మూడు ఓవర్లలో వికెట్‌ను కాపాడుకునే క్రమంలో షాట్ల జోలికి పోని ఈ ఇద్దరూ.. నాలుగో ఓవర్ నుంచి గేర్ మార్చారు. అజ్మతుల్లా నాలుగో ఓవర్లో గిల్.. డీప్ మిడ్ వికెట్, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ దిశగా రెండు సిక్సర్లు కొట్టాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన మ్యాక్స్‌వెల్.. గిల్‌ను ఔట్ చేసి పంజాబ్‌కు తొలి బ్రేక్‌నిచ్చాడు. 31 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన సుదర్శన్.. ఛేదించాల్సిన రన్ రేట్ పెరిగిపోతుండటంతో బ్యాట్‌కు పనిచెప్పాడు. కానీ అర్ష్‌దీప్ రెండో స్పెల్‌లో సుదర్శన్.. బౌండరీ లైన్ వద్ద శశాంక్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. చివరి 4 ఓవర్లలో గుజరాత్ విజయానికి 62 పరుగులు అవసరమవగా..జాన్సెన్, విజయ్‌కుమార్, అర్ష్‌దీప్..గుజరాత్‌ను అద్భుతంగా నిలువరించారు. జాన్సెన్ 18వ ఓవర్‌లో ఆఖరి బంతికి బట్లర్‌ను ఔట్ చేశాడు. ఆ తర్వాత విజయ్‌కుమార్ బౌలింగ్‌లో రూథర్‌ఫర్డ్ రెండు ఫోర్లు, తెవాటియా సిక్స్‌తో సమీకరణం కాస్తా 6 బంతుల్లో 27కు చేరింది. చివరి ఓవర్‌కు దిగిన అర్ష్‌దీప్..తెవాటియాతో పాటు రూథర్‌ఫర్డ్‌ను ఔట్ చేసి జట్టును గెలిపించాడు.

ఆర్య ఆరంభం.. శ్రేయస్ వీరవిహారం

ఈ సీజన్‌లో పటిష్టమైన జట్టుతో బరిలోకి దిగిన పంజాబ్.. పేరుకు తగ్గట్టే బ్యాటింగ్‌లో దుమ్మురేపింది. 'కింగ్స్' ఇన్నింగ్స్‌లో కొత్త కుర్రాడు ప్రియాన్ష్ ఆర్య మెరుపు ఆరంభాన్నిస్తే.. మిడిల్ ఓవర్స్‌లో శ్రేయస్ దానిని కొనసాగించగా ఆఖర్లో శశాంక్ బాదుడును నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడంతో ఈ లీగ్‌లో పంజాబ్ రెండో అత్యధిక స్కోరును నమోదుచేసింది. సిరాజ్ తొలి ఓవర్లో రెండో బంతినే బౌండరీగా మలిచిన ఆర్య.. అతడే వేసిన మూడో ఓవర్లో ఆఖరి రెండు బంతులనూ భారీ సిక్సర్లుగా మలిచాడు. అర్షద్ ఖాన్ 5వ ఓవర్లో అయితే 4, 4, 6, 4తో ఈ ఢిల్లీ కుర్రాడు 21 పరుగులు పిండుకున్నాడు. ప్రభ్‌సిమ్రన్ (5) నాలుగో ఓవర్లోనే నిష్క్రమించడంతో క్రీజులోకి వచ్చిన శ్రేయస్.. 4 ,6తో తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పాడు. 7వ ఓవర్లో రషీద్.. ఆర్యను ఔట్ చేశాడు. అజ్మతుల్లా (16) నిరాశపరచగా, మ్యాక్స్‌వెల్ డకౌట్ అయ్యాడు. స్టోయినిస్ (20) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు.

4 ఓవర్లలో 77 రన్స్

16 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ స్కోరు 166/5గానే ఉంది. ఆ జట్టు స్కోరు 200 దాటుతుందని అంతా భావించినా శ్రేయస్, శశాంక్ కలిసి విధ్వంసాన్ని మరో స్థాయికి తీసుకెళ్లి 24 బంతుల్లోనే 77 పరుగులు చేశారు. భారీ సిక్సర్‌తో అర్ధ సెంచరీని పూర్తిచేసుకున్న అయ్యర్.. ప్రసిధ్ 17వ ఓవర్లో 6, 4, 6, 6తో 24 పరుగులు రాబట్టి 90లలోకి చేరాడు. ఆఖరి ఓవర్లో శ్రేయస్ సెంచరీకి మూడు పరుగుల దూరంలో ఉండగా క్రీజులో ఉన్న శశాంక్ 23 పరుగులతో పంజాబ్‌కు ఘనమైన ముగింపునిచ్చాడు.

క్వార్టర్స్‌లో శ్రీనిధి వారియర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి బౌల్డర్‌హిల్స్ వేదికగా జరుగుతున్న అరో రియాల్టీ టీ9 గోల్ఫ్ చాంపియన్‌షిప్‌లో శ్రీనిధి దక్కన్ వారియర్స్, సమ్మర్‌స్టోమ్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాయి. హోరాహోరీగా సాగుతున్న టోర్నీలో ఫుల్-డీ నుంచి శ్రీనిధి(7.5), స్ట్రోమ్(6.5) అర్హత సాధించాయి. మిగతా విభాగాల్లో టూటోరూట్(9), బంకర్ బస్టర్స్(7.5), ఫెయిర్‌వే ఫాల్కన్స్(8.5), కైన్ డైరీ(7.5), లావిస్టా క్రూసేడర్స్(7.5), సెమెట్రిక్స్(6) క్వార్టర్స్‌లోకి ప్రవేశించాయి. టీ గోల్ఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్ఆర్ ఎన్ రెడ్డి, మధుసూదన్‌రావుతో కలిసి మూడో సీజన్ ట్రోఫీని ఆవిష్కరించారు.

కబడ్డీ జాతీయ కెప్టెన్‌గా అనూష

పెద్దమందడి, మార్చి 25 : జాతీయస్థాయి కబడ్డీ జట్టు కెప్టెన్‌గా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పిల్లిగుండ్లతండాకు చెందిన పేద విద్యార్థిని ఇస్లావత్ అనూష ఎంపికైంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇస్లావత్ రెడ్యానాయక్, జ్యోతి దంపతుల కూతురు మహబూబ్‌నగర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. కబడ్డీలో ప్రావీణ్యం చూపడంతో జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైంది. దీంతో గ్రామస్థులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

చిత్రం

నాకు నేను ఎక్కువగా ఊహించుకుంటా!

'ఇందులో నా పాత్ర పేరు నీరా వాసుదేవ్. ఫారిన్ నుంచి ఇండియా వచ్చిన అమ్మాయిని. నాకు నేను ఎక్కువగా ఊహించుకుంటూ ఉంటా. ఈ ప్రపంచమంతా నా చుట్టూనే ఉంటుందని ఫీలవుతుంటా. క్యూట్‌గా బబ్లీగా నా పాత్రను దర్శకుడు వెంకీ కుడుముల డిజైన్ చేశారు. మీకు తప్పకుండా నచ్చుతుంది.' అని నటి శ్రీలీల అన్నారు. నితిన్‌కి జోడీగా ఆమె నటించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం శ్రీలీల విలేకరులతో ముచ్చటించారు. 'వరుస రిలీజుల తర్వాత నా ఎడ్యుకేషన్ కోసం కాస్త గ్యాప్ తీసుకోవాలనుకున్నా. అలాంటి సమయంలో డైరెక్టర్ వెంకీ కాల్ చేసి, ఈ కేరక్టర్ వినిపించారు. రష్మికకు చాలా నచ్చిన పాత్ర ఇది. డేట్స్ కుదరకతను వదులుకున్నారు. దాన్ని నేను ఓకే చేశానని తెలిశాక, 'పుష్ప-2' లొకేషన్‌లో కలిసి నాకు ఆల్ ది బెస్ట్ చెప్పారు రష్మిక' అని శ్రీలీల గర్తుచేసుకున్నారు. నితిన్‌తో పనిచేయడం కంఫర్టబుల్‌గా ఉంటుందని, సినిమా విషయంలో టీమంతా కాన్ఫిడెన్స్‌తో ఉన్నామని, చక్కని క్వాలిటీతో రిచ్‌గా సినిమా ఉంటుందని శ్రీలీల తెలిపారు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్‌ల ట్రాక్‌ని షూట్ చేస్తున్నప్పుడే పడిపడి నవ్వానని, వీరి సీన్స్ హిలేరియస్‌గా ఉంటాయని శ్రీలీల చెప్పారు.

ఉగాదిన శ్రీకారం



అగ్ర నటుడు చిరంజీవి తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం సీజీ వర్క్ జరుగుతున్నదని సమాచారం. తొలుత ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం జూన్‌లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో చిరంజీవి తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకుడు. ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను కొట్టారు అనిల్ రావిపూడి. దాంతో చిరంజీవితో ఆయన చేయబోతున్న సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. తాజా సమాచారం ప్రకారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించబోతున్నారని తెలిసింది. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, ఇందులో డ్యూయెట్స్ లాంటివి ఉండవని, ప్రేక్షకులకు చక్కటి వినోదాన్ని అందించడమే లక్ష్యంగా దర్శకుడు అనిల్ రావిపూడి స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని అంటున్నారు. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

ఇతిహాసాల్లో కనని వినని కొత్త పాత్రలో..

'పుష్ప' ఫ్రాంచైజీతో అందనంత స్టార్‌డమ్‌ని సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. నిజానికి 'పుష్ప-2' తర్వాత ఆయన త్రివిక్రమ్‌తో సినిమా చేయాలి. కానీ ఆ ప్లేస్‌లో అట్లీ ప్రాజెక్ట్ వచ్చి చేరింది. నిర్మాత నాగవంశీ మాటల్లో దానికి గల కారణం తేటతెల్లమైంది. 'బన్నీ, త్రివిక్రమ్ కలయికలో మేం చేయబోయే చిత్రం దేశం గర్వించేలా ఉంటుంది. ఇండియన్ సినిమా హిస్టరీలో ఇప్పటిదాకా ఎవరూ టచ్ చేయని పాయింట్ ఇది. మైథాలజీ సబ్జెక్ట్‌తో ఈ సినిమా ఉంటుంది. అయితే.. ఇది రామాయణ, మహాభారతాలకు సంబంధించిన కథ కాదు. ఇది మన ఇతిహాసాల్లో ఎవరికీ తెలియని కొత్త కథ. ఎవ్వరూ చూడని కొత్త పాత్రలో ఇందులో బన్నీ కనిపిస్తారు. పానిండియా స్థాయిలో వందలకోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా ఉంటుంది. దీనికి ప్రీప్రొడక్షన్ వర్క్‌కి ఎక్కువ సమయం అవసరం. ప్రస్తుతం త్రివిక్రమ్ ఆ పనిలోనే ఉన్నారు' అని తెలిపారు నాగవంశీ.

'జయహో రామానుజ' గీతాలు

స్వీయ దర్శకత్వంలో సాయివెంకట్ నటిస్తున్న చిత్రం 'జయహో రామానుజ'. జోశర్మ కథానాయిక. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మాతలు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మంగళవారం పాటల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయివెంకట్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తెలుగు ప్రజలకు రామానుజాచార్యుల గొప్పతనాన్ని తెలియజెప్పాలని ఈ సినిమా చేశా. తిరుమల వెంకటేశ్వరుడికి శంఖు చక్రాలను రామానుజాచార్యుల వారే బహూకరించారు. ఈ సినిమాలో నేను 11 పాత్రల్ని పోషించాను. ఇదొక రికార్డుగా భావిస్తున్నా' అన్నారు. భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమాను నిర్మించామని నిర్మాత ప్రవల్లిక తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: సుదర్శనం సాయిప్రసన్న, సుదర్శనం ప్రవల్లిక, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: లయన్ సాయి వెంకట్.

వెంటాడే సొంతూరి జ్ఞాపకాలు

ఇంటి చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు.. బంధాల నేపథ్యంలో రూపొందిన వెబ్ సిరీస్ 'హోంటౌన్'. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి ప్రధాన పాత్రధారులు. శ్రీకాంత్‌రెడ్డి పల్లే దర్శకుడు. నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మాతలు. ఏప్రిల్ 4న ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సిరీస్ ట్రైలర్‌ని అగ్రహీరోగా విజయ్ దేవరకొండ మంగళవారం విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'బ్రతుకుతెరువు కోసం సొంతూర్లను విడిచిపెట్టినా.. ఊరి జ్ఞాపకాలు మాత్రం మనల్ని విడిపెట్టవ్. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసేలా ఈ సిరీస్ ఉంటుంది' అని మేకర్స్ చెబుతున్నారు. కుటుంబ సంఘర్షణల నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ ట్రైలర్ సాగింది. రాజీవ్‌కనకాల, ఝాన్సీ, అనీ.. తదితరులు ట్రైలర్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దేవ్‌దీప్ గాంధీ కుండు, సంగీతం: సురేష్ బొబ్బిలి.

ఏదో ఏ జన్మలోదో..

కీరవాణి పాట రాయడం. దానిని ఇసైజ్ఞాని ఇళయరాజా స్వరపరచడం. ఆ పాటను దేవిశ్రీ ప్రసాద్ విడుదల చేయడం. ఈ స్వర త్రివేణీ సంగమాన్ని అరుదుగా జరిగే ఆసక్తికరమైన విషయంగా పేర్కొనవచ్చు. రూపేష్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న కుటుంబ కథాచిత్రం 'షష్టిపూర్తి'. ఆకాంక్ష సింగ్ కథానాయిక. రాజేంద్రప్రసాద్, అర్చన ముఖ్య పాత్రధారులు. పవన్ ప్రభ దర్శకుడు. ఇళయరాజా సంగీత దర్శకుడు. ఈ సినిమా కోసం కీరవాణి రాసిన 'ఏదో ఏ జన్మలోదో..' అంటూ సాగే గీతాన్ని ఇళయరాజా స్వరపరిచారు. ఆనన్యభట్ పాడారు. దేవిశ్రీప్రసాద్ పాటను మంగళవారం విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ పాటలో కథంతా చెప్పాలి. అందుకే కీరవాణిగారిని రాయమని అడిగాం. ఇళయరాజా సంగీతంలో పాట అనగానే ఆయన ఆనందంగా ఒప్పుకున్నారు. గొప్పగా రాశారు' అని తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.